

అంతా రామమయం

అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవం నేపథ్యంలో కోనసీమ జిల్లావ్యాప్తంగా రామనామ స్మరణ హోరెత్తింది. గ్రామ గ్రామాన రామభక్తులు శోభాయాత్ర నిర్వహించారు. ఎక్కడ చూసినా జైశ్రీరాం నినాదం హోరెత్తిపోయింది. అమలాపురం పట్టణ పురవీధులతో పాటు కోనసీమలోని గ్రామాలన్నీ సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు శ్రీరామనామ స్మరణతో మార్మోగిపోయాయి. రామ భక్తులు కాషాయ వస్త్రాలు ధరించి కాషాయ జెండాలు చేతబట్టి మోటారు సైకిళ్లపై ర్యాలీగా ఊరేగింపులు నిర్వహించారు. అమలాపురంలో శోభాయాత్ర, సీతారామ లక్ష్మణ సమేత హనుమంతుని వేషధారణల్లో చిన్నారులను ఈ చిత్రాల్లో చూడవచ్చు.... 8లో





ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

15,10,472

- ఇదీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఓటర్ల సంఖ్య
- తుది జాబితా విడుదల చేసిన కలెక్టర్ హిమాన్షు శుక్లా
- కొత్తగా చేరిన ఓటర్లు 21,678 మంది
- జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే అధికం
- అత్యధికంగా కొత్తపేట నియోజకవర్గంలో 2,48,392 మంది
- అత్యల్పంగా రాజోలు నియోజకవర్గంలో 1,96,190 మంది

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త 2024 షెడ్యూల్ ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఓటర్ల తుది జాబితాను సోమవారం ప్రకటించారు. వివిధ రాజకీయ పార్టీల నేతల సమక్షంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా విడుదల చేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 15,10,472 మంది ఓటర్లతో కూడిన తది జాబితా ప్రకారం మహిళలదే పైచేయి. వీరిలో 21,678 మంది కొత్త ఓటర్లు ఉన్నారు. కొత్త ఓటర్లతో కలిపి పురుషులు 7,50,066 మంది, మహిళలు 7,60,389 మంది, ఇతరులు 15 మంది వున్నారు. అత్యధికంగా కొత్తపేట నియోజకవర్గంలో 2,48,392 మంది ఉన్నారు. ద్వితీయ స్థానంలో ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో 2,41,870 మంది, తృతీయ స్థానంలో మండపేట నియోజకవర్గానికి చెందిన 2,17,645 మంది ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా రాజోలు నియోజకవర్గంలో 1,96,190 మంది ఉన్నారు. నియోజకవర్గాల వారీగా చూస్తే రామచంద్రపురం 2,00,147 మంది, అమలాపురం 2,10,891 మంది, పి.గన్నవరం 1,96,337 మంది ఓటర్లు ఉన్నారు.

జిల్లాలో కొత్తగా నమోదైన మొత్తం ఓటర్ల సంఖ్య 21,678. అత్యధికంగా అమలాపురం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి 4,508 మంది, అత్యల్పంగా రామచంద్రపురం నియోజకవర్గం నుంచి 2,146 మంది చేరారు. వీరిలోనూ మహిళలే అత్యధికం. నియోజకవర్గాల వారీగా చూస్తే రామచంద్రపురంలో 944 మంది పురుషులు, 1,207 మంది మహిళలు, ఇతరులు ఆరుగురు మొత్తం 2146 మంది. ముమ్మిడివరంలో 1,274 మంది పురుషులు, 299 మంది మహిళలు... మొత్తం 3,373 మంది. అమలాపురంలో 1,938 మంది పురుషులు, 2,569 మంది మహిళలు, ఇతరులు ఒకరు... మొత్తం 4,500 మంది. రాజోలులో 1,589 మంది పురుషులు, 1,912 మంది మహిళలు... మొత్తం 3,501 మంది. పి.గన్నవరంలో 1,326 మంది పురుషులు, 1,536 మంది మహిళలు... మొత్తం 2,862 మంది. కొత్తపేటలో 1,381 మంది పురుషులు, 1,656 మంది మహిళలు... మొత్తం 3,037 మంది. మండపేటలో 865 మంది పురుషులు, 1,386 మంది మహిళలు... మొత్తం 2,251 మంది. ఏడు నియోజకవర్గాల్లో పురుషులు 9,315 మంది కాగా మహిళలు అత్యధికంగా 12,366 మంది, ఇతర ఓటర్లు ఐదుగురు ఉన్నారు.



అంబాజీపేట స్టేషన్ వద్ద పోలీసుల అదుపులో ఉన్న అంగన్‌వాడీలు

పోలీసుస్టేషన్లలో అంగన్‌వాడీల నిర్బంధం

- ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట రాత్రి నిరసన
- కలెక్టరేట్ ఎదుట అఖిలపక్ష నాయకుల ధర్నా

అమలాపురం టౌన్, జనవరి 22: జగనన్నకు చెబుదాం పేరుతో కోటి సంతకాలు సేకరించి విజయవాడ బయల్దేరుతున్న అంగన్‌వాడీలను సోమవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం రాత్రి అంగన్‌వాడీల సంఘ నాయకులు పలువురిని గృహ నిర్బంధం చేశారు. అమలాపురం మండల పరిధిలోని 55 మంది అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకుని తాలూకా సీఐ కార్యాలయం వద్ద సాయంత్రం వరకు నిర్బంధించారు. పోలీసుల అదుపులో ఉన్న అంగన్‌వాడీలకు సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కన్వీనర్ కొప్పుల సత్తిబాబు సంఘీభావం తెలిపారు. అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలని, వారి సమస్యలను పరిష్కరించాలని వామపక్షాలతో పాటు టీడీపీ, జనసేన, ఆర్పీఐ నాయకులు డిమాండు చేశారు. అంగన్‌వాడీలపై ప్రభుత్వ, పోలీసుల దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండించారు. అదుపులోకి తీసుకున్న అంగన్‌వాడీలను తక్షణం విడుదల చేయాలని డిమాండు చేశారు. జగన్ పాదయాత్రలో భాగంగా అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. ధర్నాలో ఆర్పీఐ జాతీయ కార్యదర్శి డీబీ లోక్, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, సీపీఐ, సీపీఎం నాయకులు కె.సత్తిబాబు, కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ కొప్పుల నాగమానస (జనసేన), ప్రజా సంఘాల నాయకులు గుదే దుర్గాప్రసాద్, వాసంశెట్టి సత్తిరాజు, కె.శంకర్, పి.అమూల్య కె.బేబీగంగారత్నం, మచ్చా నాగయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబును కలిసి వినతిపత్రం అందజేశారు.

ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్టు సీడీపీవోతో పాటు సూపర్‌వైజర్లు అంగన్‌వాడీలకు ఫోన్లు చేసి బెదిరించడంతో పాటు విధుల్లో చేరకపోతే తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేయడం, కొందరిని బలవంతంగా విధుల్లోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ సోమవారం రాత్రి అంగన్‌వాడీలు నిరసనకు దిగారు. సీడీపీవో బయటకు రావాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న తాలూకా సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. నిరసనలో అంగన్‌వాడీ సంఘ నాయకులు పి.అమూల్య, కె.బేబీగంగారత్నం, దైవకృపతో పాటు పలువురు పాల్గొన్నారు.

కాగా అంగన్‌వాడీ యూనియన్ నేతలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలయ్యాయి. వారి 11 డిమాండ్లలో పదింటిని నెరవేరుస్తామని ప్రభుత్వ ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీలు సోమవారం అర్ధరాత్రి దీక్ష విరమించారు.

కోనసీమ జిల్లాలోని అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల తొలగింపునకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. సుమారు 3,200 మంది అంగన్‌వాడీ సిబ్బందిని తొలగించేందుకు ఐసీడీఎస్ అధికారులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు సోమవారం ప్రతిపాదనలు పంపించారు. దీనిలో భాగంగా జిల్లాలో 1,700 మంది అంగన్‌వాడీ సిబ్బంది ఉండగా వారిలో ప్రభుత్వం నోటీసులు ఇచ్చిన తర్వాత 49 మంది విధులకు హాజరయ్యారు. మిగిలిన 1,651 మంది కార్యకర్తలను విధుల నుంచి తొలగించాలని కలెక్టర్‌కు నివేదిక పంపించారు. అదే విధంగా 1,600 మంది ఆయాలు పని చేస్తుండగా వారిలో నోటీసులు ఇచ్చిన తరువాత 52 మంది విధులకు హాజరయ్యారు. మిగిలిన 1,548 మందిని విధుల నుంచి తొలగించాల్సిందిగా కలెక్టర్‌కు ప్రతిపాదనలు అందాయి. అయితే ఇప్పటివరకు కలెక్టర్ కార్యాలయం నుంచి తొలగింపు ఉత్తర్వులు వెలువడలేదు.

అక్రమ అరెస్టులు దారుణం



- డి.లలితాకుమారి, మాచవరం

అంగన్‌వాడీలు వారి డిమాండ్లను పరిష్కరించాలని పోరాడుతుంటే ప్రభుత్వం పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించడం దారుణం. ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను తక్షణం పరిష్కరించాలి.

ప్రభుత్వం పట్టించుకోవట్లేదు



- కె.విజయలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్, అమలాపురం

మాతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. మా డిమాండ్లను పరిష్కరించాలని 42 రోజులుగా నిరసన తెలుపుతున్నాం. అయినా ప్రభుత్వం దిగిరాక పోవడం శోచనీయం.

'స్పందన'కు 156 అర్జీలు

అమలాపురం టౌన్, జనవరి 22: కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం నిర్వహించిన 'స్పందన'లో సమస్యల పరిష్కారానికై జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారు 156 అర్జీలు అందించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు అర్జీలు స్వీకరించారు. సీపీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, డీపీవో వి.కృష్ణకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆక్వా అక్రమ సాగును అడ్డుకోండి

రేవు ఈశ్వరరావు, ఐ.పోలవరం, రైతు

గ్రామంలో వ్యవసాయ పంట పొలాల మధ్య ఆక్వా అక్రమ సాగు చేపట్టారు. దీంతో మా పంటలు దెబ్బతింటు న్నాయి. మండల స్థాయి అధికారులు, మత్స్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా అడ్డుకట్ట వేయలేదు. ఇప్పుడు ఆ వ్యక్తులు కులం పేరుతో దూషిస్తూ బెదిరిస్తున్నారు. ఆక్వా జోన్ పరిధిలో లేని భూముల్లో అక్రమ సేద్యాన్ని నిలుపుదల చేసి పంట పొలాలను కాపాడాలి. విచారణ జరిపి దౌర్జన్యానికి పాల్పడ్డ వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి ప్రాణ రక్షణ కల్పించాలి.

దివ్యాంగ పెన్షన్ ఇప్పించండి

పలివెల ఏడుకొండలు, కూళ్ల, కె.గంగవరం మండం

రోడ్డు ప్రమాదంలో కాళ్లు విరిగిపోయాయి. సదరం సర్టిఫికెట్ పొందాను. దివ్యాంగ పెన్షన్ పొందేందుకు అన్ని అర్హతలూ ఉన్నాయి. పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. నెలలు గడిచిపోతున్నా మంజూరు కాలేదు. ఏ పనీ చేసుకోలేని పరిస్థితుల్లో కుటుంబాన్ని భారంగా నెట్టుకొస్తున్నాం. దివ్యాంగ పెన్షన్ ఇప్పించి ఆదుకోండి.

పిండ ప్రదానం చేసుకునేదెలా!

అడబాల సత్యనారాయణ, ఎ.గంగాధరం, పి.ఫణికుమార్ తదితరులు, కాట్రేనిపాడు రాజోలు మండలం

గ్రామంలోని మురుగుకాల్వ చెంతన తరతరాలుగా హిందూ సంప్రదాయం ప్రకారం పిండ ప్రదానాలతో పాటు ఇతర అంత్యక్రియలు నిర్వహించుకునేవారు. ఇప్పుడు ఆ స్థలం ఆక్రమణలకు గురైంది. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశాం. ఆక్రమణదారులు బెదిరింపులకు దిగుతున్నారు. సదరు స్థలంపై విచారణ జరిపించి న్యాయం చేయాలి.





(అనపర్తి)

కొప్పవరం సంబరం

సత్తెమ్మ తల్లి కొంగు బంగారం



ధనిక, పేద, కులం, మతం, చిన్న పెద్ద తారతమ్యం లేకుండా నీ మొక్కులు చెల్లించడానికి వచ్చాం..కరుణించమ్మా అంటూ భక్తులు వేడుకున్నారు. కొంగు బంగారమైన సత్తెమ్మ తల్లి మొక్కులు తీర్చుకున్నారు. అనపర్తి మండలం కొప్పవరంలోని కర్రి వారి సత్తెమ్మ జాతర సోమవారం వైభవంగా జరిగింది. మూడు రోజులు జరిగే ఈ సంబరం సోమవారం జరిగిన జాతరతో ముగిసింది.




పండుగకి 200 ఏళ్ల చరిత్ర

సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన అమ్మవారి ఆవిర్భావంపై ఇక్కడ ఒక కథ ప్రాచుర్యంలో ఉంది. సుమారు 200 సంవత్సరాల క్రితం ఊతకోటకు చెందిన ఐదుగురు సభ్యులు గల కర్రి వారి వంశీయులు గ్రామంలో పనులు లేక ఏమి చేయాలో పాలుపోని పరిస్థితిలో గోదావరి పాయకు చేరుకుని విచార వదనంలో బాధపడుతుండగా అక్కడకు ఒక పాప వచ్చి వారి కష్టాన్ని అడిగి తెలుసుకుంది. బతికేందుకు మంచి ప్రాంతాన్ని చూపుతానని తనతో రావాలంటూ అనపర్తి మండలం కొప్పవరం గ్రామం తీసుకువచ్చి ఇక్కడ మీరు బతికేందుకు అన్ని సదుపాయాలు ఉన్నాయని సుఖసంతోషాలతో జీవించాలని చెప్పి అంతర్ధానమైంది. దీంతో వారంతా తమకు దారి చూపేందుకు సత్తెమ్మ తల్లి బాలిక రూపంలో వచ్చిందని నమ్ముతూ ఆమెను అమ్మరూపంగా ఆరాధించడం ప్రారంభించారు. ఇలా జరుగుతుండగా కొప్పవరం చేరుకున్న కర్రి వంశీయులు ఇక్కడ వ్యవసాయం చేయడం ప్రారంభించారు. ఇలా వారంతా సంతోషంగా బతుకుతున్న తరుణంలో కళ్ళాల్లో ధాన్యం దొంగలపాలవడం ప్రారంభమైంది. ఒక రోజు అమ్మవారు భక్తుడి కలలోకి వచ్చి పంటను దొంగలు దోచుకుంటున్నారని తాను నాగదేవత రూపంలో కళ్ళం వద్ద ఉన్నానని చెప్పడంతో అక్కడికి వెళ్లిన రైతు దొంగలను చూసి ఆశ్చర్యపోయాడు. రైతును చూసిన దొంగలు పరారయ్యారు. నాగ దేవత రూపంలో ఉన్న అమ్మవారు సమీపంలో ఉన్న పాముల పుట్టలోకి వెళ్లి అంతర్ధానమయ్యారు. దీంతో కర్రి వారి వంశీయులు ప్రతి రెండేళ్లకు ఒకసారి జాతరలో నాగదేవతను పూజించడం ఆచారంగా వస్తోంది.



3 రోజుల సంబరం

మొదటి రోజు మిద్దెపై ఉన్న కత్తిరి కుండను కిందకు దింపడంతో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. దింపిన కుండకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజలు నిర్వహించిన కుండను సంతానం లేని వారు శిరస్సుపై ధరిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. రెండో రోజు పుట్ట వద్దకు వేషాలు ధరించి వెళ్లిన భక్తులు అమ్మకు పాలు పోసి పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని భక్తులు ఆలయ పూజారులతో బడిత పూజ చేయించుకుంటారు. ఇలా చేస్తే వచ్చే రెండేళ్ల పాటు అమ్మ కాపాడుతుందని భక్తుల నమ్మకం.

వివిధ వేషధారణల్లో భిక్షాటన చేస్తున్న భక్తులు

ఆఖరి రోజున భిక్షాటన జాతర

ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరలో ప్రతి అంశం ఆసక్తికరంగా ఉంటుంది. ఇక్కడ అమ్మవారికి మొక్కులు చెల్లించుకునే భక్తులు ఏదో ఒక విచిత్ర వేషం ధరించి జాతరలో భిక్షాటన చేయాలి. అలా భిక్షం తీసుకోగా వచ్చిన కానుకలను మాత్రమే అమ్మ స్వీకరిస్తుందని ఇక్కడి భక్తుల విశ్వాసం. దీంతో సోమవారం జరిగిన జాతరలో భక్తులు అనేక వేషాలు ధరించి భిక్షాటన చేశారు. మోతుబరి నుంచి కూలీ వరకు, విద్యాధికుడి నుంచి నిరక్షరాస్యుడి వరకు కుల, మత, జాతి, ధనిక, పేద తారతమ్యం లేకుండా వేషాలు ధరించి భిక్షాటన చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. సినిమాలో పాత్రలను వేషాలుగా ధరించిన వ్యక్తులు డైలాగులు వల్లిస్తూ అలరించారు. సాధారణంగా జాతరలు రాత్రి పూట నిర్వహిస్తారు. కానీ ఇక్కడ పగటి పూట నిర్వహించడం విశేషం. సత్తెమ్మ తల్లిని సర్పంచ్ కర్రి బులిమోహనరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు, తనయుడు మనోజ్‌రెడ్డి, తెలుగు మహిళలు జుత్తుగ సూర్యకుమారి, పోతంశెట్టి సుభాషిణి, సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, బాసి, కర్రి వెంకటరామారెడ్డి, ఆళ్ల గోవిందు దర్శించుకున్నారు.








రత్నగిరిపై ఎల్‌ఈడీ స్క్రీన్‌లో ప్రతిష్ఠాపనోత్సవాలు

అన్నవరంలో శోభాయాత్ర

అన్నవరం, జనవరి 22: అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అన్నవరంలో సంబరాలు అంబరాన్నంటాయి. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం లైవ్ ద్వారా తిలకించాలనే ఉద్దేశ్యంతో ఈవో రామచంద్రమోహన్ ప్రత్యేక ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యదేవుడి క్షేత్ర పాలకులుగా పూజలందుకుంటున్న సీతారాముల ఆలయంలో అభిజిత్ లగ్నంలో ప్రత్యేక పూజలు నిర్వహింపచేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామంలో పార్టీలకతీతంగా నాయకులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో శోభాయాత్రను నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ వందలాది మందితో ర్యాలీ చేపట్టడంతో రామనామ జపంతో అన్నవరం మార్మోగిపోయింది. కార్యక్రమాన్ని దేవస్థానం ఈవో రామచంద్రమోహన్ ప్రారంభించారు. సుమారు 10 కిలోమీటర్ల మేర ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో శోభాయాత్ర కమిటీ సభ్యులు కామర్స్ చిరంజీవి, పోచినపెద్ది రాధాకృష్ణ, దాసరి నగేష్, ప్రసాద్, గణపతి, సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ దారా వెంకటరమణ, ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభరాజా, టీడీపీ నాయకులు మధుబాబు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ముక్కామల కళాకారులు



అంబాజీపేట, జనవరి 22: దేశ రాజధాని ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో ఏపీ ప్రభుత్వ శకటం తరపున పాల్గొనేందుకు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ముక్కామలకు చెందిన కూచిపూడి కళాకారులకు అవకాశం దక్కింది. ఏపీ సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ పోతుల కిరణ్‌కుమార్ సారథ్యంలో ముక్కామలకు చెందిన వాయిద్య కళాకారుడు పసుపులేటి నాగబాబు ఆధ్వర్యంలో శిక్షణ పొందిన కూచిపూడి కళాకారులు ఈనెల14న ఢిల్లీకి చేరుకున్నారు. అక్కడ శిక్షణ కొనసాగిస్తూ ఈనెల 21న నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్రీయ రంగస్థల (ఆర్ఆర్) క్యాంపు నిర్వాహకులు అన్ని రాష్ట్రాల కళాకారులకు నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో ఏపీ తరఫున పాల్గొన్న కూచిపూడి కళాకారులు తృతీయ స్థానం సాధించారు. తమకు శిక్షణ ఇచ్చిన గురువు హేమ సాయికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ఏడాది ముక్కామలకు చెందిన పసుపులేటి నాగబాబు గరగనృత్య బృందం ఏపీ తరుపున ఢిల్లీలో ఏకాదశ రుద్రుల శకట ప్రదర్శనలో పాల్గొంది.

అయోధ్యకు ప్రత్యేక రైళ్లు

రాజమండ్రి, సామర్లకోట, తుని, అన్నవరం మీదుగా..

సామర్లకోట, జనవరి 22: అయోధ్య రామ మందిరం సందర్శించే భక్తుల సౌకర్యార్థం రైల్వే ఫిబ్రవరి 7,10,11,14 తేదీలలో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను సామర్లకోట, రాజమండ్రి రైల్వే స్టేషన్ల నుంచి నడుపుతున్నట్లు రైల్వే ట్రాన్స్‌పోర్టేషన్ అధికారి కార్యాలయం నుంచి సోమవారం రాత్రి సమాచారం అందింది.

07217 నంబరు గల రాజమండ్రి-అయోధ్య మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 7న బుధవారం బయలుదేరనుంది. ఈ రైలు రాజమండ్రిలో ఫిబ్రవరి 7న బుధవారం సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, దువ్వాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస మీదుగా అయోధ్యడామ్‌కు శుక్రవారం రాత్రి 11.00కి చేరుతుంది.

07217 నంబరు పేరిట అయోధ్య డామ్-రాజమండ్రి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 10న శనివారం బయలుదేరనుంది. ఈ రైలు అయోధ్య డామ్‌లో ఫిబ్రవరి 10న శనివారం రాత్రి 11 గంటలకు బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు రాజమండ్రి చేరుతుంది.

07218 నంబరు గల సామర్లకోట-అయోధ్య మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 11న బయలుదేరనుంది. ఈ రైలు సామర్లకోటలో ఆదివారం రాత్రి 6.30 గంటలకు బయలుదేరి అన్నవరం, తుని, దువ్వాడ, విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస మీదుగా అయోధ్యడామ్‌కు మంగళవారం ఉదయం 10.35కి చేరుతుంది. మొత్తం 1,870 కిలోమీటర్ల దూరాన్ని ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు 40.05 గంటల పాటు ప్రయాణిస్తుంది. 07218 నంబరు గల అయోధ్య-సామర్లకోట మధ్య ఫిబ్రవరి 14న బుధవారం రాత్రి 7.55కి బయలుదేరనుంది. ఈ రైలు అయోధ్య డామ్‌లో బుధవారం రాత్రి 7.55కి బయలుదేరి శుక్రవారం మధ్యాహ్నం 1.00 గంటకు చేరుతుంది. మరిన్ని వివరాలకు సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ అధికారులను సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారులు ఆ లేఖలో తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం



తుని రూరల్, జనవరి 22: కాకినాడ జిల్లా తునిరూరల్ మండలం చామవరం శివారు వల్లూరు రోడ్డులో గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించినట్టు ఎస్ఐ విజయ్‌బాబు తెలిపారు. స్థానిక వీఆర్వో సమాచారంతో మృతదేహాన్ని పరిశీలించి ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. మహిళ వివరాలు తెలియలేదని సంబంధీకులు ఎవరైనా ఉంటే రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

రీసెర్చ్ ఫెలోషిప్ సాధించిన యువకుడు

సర్పవరం జంక్షన్, జనవరి 22: యూజీసీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌కు చెందిన పీజీ విద్యార్థి బాల జయదీప్ ఎంపికయ్యాడు. సోమవారం తిమ్మాపురం పీజీ క్యాంపస్‌లో నిర్వహించిన అభినందన సభలో జయదీప్‌ను ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ ఆధ్వర్యంలో అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగానికి చెందిన బాల జయదీప్ యూజీసీ నిర్వహించిన ఎలిజిబిలిటీ టెస్ట్‌లో ఫెలోషిప్‌కు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. సివిల్స్ సాధించడమే లక్ష్యంగా చదువుతున్నట్లు జయదీప్ తెలిపారు. కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ కె.జోసెఫ్ స్టీఫెన్, సహాయ ఆచార్యులు డాక్టర్ ఎం.నానిబాబు, డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ ఎం.గోపి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వరహాలు, జూనియర్ అసిస్టెంట్ ఎం.లలిత తదితరులు జయదీప్‌ని అభినందించారు.



జయదీప్‌ను అభినందిస్తున్న అధ్యాపక బృందం

వైసీపీ ప్రభుత్వ హయాంలో కాపులకు అన్యాయం

కాపు ఉప కులాల జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

రావులపాలెం, జనవరి 22: కాపు, కాపు ఉప కులాల సంక్షేమానికి సంబంధించిన సమస్యల పరిష్కారాలు వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురయ్యాయని కాపు జేఏసీ నేత ఆకుల రామకృష్ణ అన్నారు. రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో రాష్ట్ర కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల రామకృష్ణ మాట్లాడుతూ కాపు జేఏసీ ఏ పార్టీకీ అనుకూలంగా లేదన్నారు. ముద్రగడ పద్మనాభం సారథ్యంలో గతంలో చేపట్టిన ఉద్యమాలతో కొన్ని ఫలితాలు సాధించామని, అయితే అవి అందలేదన్నారు. జనాభా ప్రాతిపదికన కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని, కాపుల సమస్యలపై ప్రధాన రాజకీయ పార్టీలు స్పందించాలని, లేనిపక్షంలో ఓటు అనే ఆయుధంతో ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కాపులకు గత ప్రభుత్వం 5 శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేయకపోవడంతో సచివాలయ ఉద్యోగాల భర్తీ సమయంలో కాపు, కాపు ఉప కులాలకు చెందిన నిరుద్యోగులు 24వేల మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు. జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయాల్లో అవకాశం కల్పించాలన్నారు. వార్డు నుంచి పార్లమెంటు స్థాయి వరకు పదవుల్లో ప్రాధాన్యమివ్వాలన్నారు. నూతన జిల్లాలు ఏర్పడిన సమయంలో ఎందరో ముఖ్య నేతల పేర్లు పెట్టారని, కాపు కులంలో ఉద్యమాలు, పోరాటాలు చేసిన వారి పేర్లు పెట్టలేదన్నారు. నూతన జిల్లాలకు శ్రీకృష్ణదేవరాయలు, వంగవీటి మోహనరంగా, కూర్మ వెంకటరెడ్డి, కన్నెగంటి హనుమంతు, పెరియార్ రామస్వామి పేర్లు పెట్టాలన్నారు. కార్పొరేషన్ నిధులు ఏడాదికి రూ.2 వేల కోట్లు విడుదల చేయాలన్నారు. కాపులకు వెనుకబడిన కేటగిరీల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తూ గత ప్రభుత్వం రూపొందించిన బిల్లును వెంటనే అమలు చేయాలన్నారు. రైతు భరోసా పథకాన్ని కాపు కౌలు రైతులకూ అమలు చేయాలన్నారు. ఇదే తరహాలో ఈ నెల 28న విశాఖపట్నంలో జేఏసీ నాయకుడు రాజీవ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తామన్నారు. రాయలసీమ, భీమవరంలో కూడా సమావేశాలు జరుపుతామన్నారు. సమావేశంలో జేఏసీ ముఖ్య నేతలు తోట రాజీవ్, ఆరేటి ప్రకాష్, నల్లా విష్ణుమూర్తి, వాసిరెడ్డి ఏసుదాసు, చందు, జనార్థన్, దాసరి రాము, ముత్యాల రామదాసు, ఉమామహేశ్వరి, సీహెచ్ వెంకటరాయుడు, మాక శ్రీనివాస్, ముచ్చర్ల శ్రీరామ్, రంకిశెట్టి మంగబాబు తదితరులు పాల్గొన్నారు.



ఐక్యతను చాటుతున్న నేతలు

బాలికను హతమార్చిన సవతి తల్లికి యావజ్జీవం

కాకినాడ క్రైం, జనవరి 22: కన్నతల్లి స్థానంలో ఉండి పిల్లల ఆలనా.. పాలనా చూడాల్సిన సవతి తల్లి స్వార్థపూరిత దుర్బుద్ధితో ఏడేళ్ల బాలికను హతమార్చడమే కాకుండా సాక్ష్యాలు తారుమారు చేసేందుకు మృతదేహాన్ని గోనె సంచిలో కట్టి ఉప్పుటేరులో విసిరేసిన నేరం ఋజువు కావడంతో ఓ మహిళకు కాకినాడ నాలుగో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.హరినారాయణ యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధించారు. కాకినాడ రూరల్ మండలం, తూరంగి పగడాలపేటకు చెందిన సూరాడ సత్యశ్యామ్‌కుమార్ గతంలో సీసీ కెమెరాల టెక్నీషియన్‌గా పని చేస్తూ రాజమహేంద్రవరంలోని లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో ఉండేవాడు అక్కడ సత్యవతి అనే ఆమెను 2012లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి 2013లో దీప్తి శ్రీ ఇషాని పుట్టింది. అయితే 2016 లో సత్యవతి బ్రెయిన్ హేమరేజ్‌తో మృతి చెందింది. దాంతో దీప్తికి తల్లి లేని లోటు తీర్చేందుకు శ్యామ్‌కుమార్‌కు అతని కుటుంబీకులు 2017లో కాకినాడ డైరీఫామ్ సెంటర్, సంజయ్‌నగర్‌కు చెందిన శాంతికుమారిని ఇచ్చి వివాహం జరిపించారు. వారికి 2018 లో మోక్షిత్ నూతన్ అనే కుమారుడు జన్మించాడు. అయితే శ్యామ్‌కుమార్‌కు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఆ కుటుంబం కాకినాడ డైరీఫామ్ సెంటర్‌కు వచ్చేసింది. అనంతరం తన భర్త పేరున ఉన్న ఇల్లు తన కుమారుడికి కాకుండా దీప్తి పేరున రాసేస్తారేమోనని అపోహ పడి అప్పటి నుంచి కన్న కూతురిలాంటి దీప్తిపై కక్ష పెంచుకుని ఎలాగైనా ఆ చిన్నారిని అంతం చేయాలని పథకం రచించింది. ఈ క్రమంలో తన నానమ్మ ఇంటి వద్ద ఉంటూ జగన్నాథపురం నేతాజీ మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న దీప్తి వద్దకు శాంతికుమారి 2019 నవంబరు 22న మారు వేషంలో వెళ్లి దీప్తిని ఎవరికి చెప్పకుండా ఇంటికి తీసుకుని వచ్చి టవల్‌తో పీక బిగించి హత్య చేసింది. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా ప్లాస్టిక్ సంచిలో మూట కట్టి ఇంద్రపాలెం బ్రిడ్జి పై నుంచి ఉప్పుటేరులోకి విసిరేసి సాక్ష్యం లేదు తనకి ఏమీకాదులే అనుకుని అక్కడ నుంచి వెళ్లిపోయింది. అనంతరం స్కూల్ నుంచి ఇంటికి రాకపోయేసరికి తన కుమార్తె దీప్తి కనబడడంలేదని సత్యశ్యామ్‌కుమార్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి వన్‌టౌన్ సీఐ టి.రామ్మోహన్ రెడ్డి దర్యాప్తు జరిపి నిందితురాలు శాంతికుమారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. వాదోపవాదనల అనంతరం నిందితురాలిపై నేరం ఋజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ వై.ప్రశాంతికుమారి వాదించారు. సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టడంలో విశేష కృషి చేసిన ప్రస్తుత వన్‌టౌన్ సీఐ వాడవెల్లి సురేష్‌బాబు బృందాన్ని ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ అభినందించారు.

సముద్ర తీరానికి వెదురు మండపం

అంతర్వేది, జనవరి 22: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామ పంచాయతీ హైస్కూలు రోడ్డుకు ఆనుకుని ఉన్న సముద్ర తీరం ఒడ్డుకు శ్రీలంకకు చెందిన వెదురుకర్రల మండపం కొట్టుకు వచ్చింది. తీరం వెంబడి శ్రీరామ నామస్మరణతో మార్మోగుతున్న సందర్భంలో సముద్ర కెరటాలకు కొట్టుకువచ్చిన వెదురు కర్రల పల్లకీ చూపరులను మంత్ర ముగ్ధుల్ని చేసింది. వివిధ రకాల ఇత్తడి కిరీట భాగాలు, బౌద్ధ మతానికి చెందిన పేయింటింగులు, శ్రీలంక భాషతో ఉన్న కర్టెన్లతో కూడిన మండపాన్ని చూసేందుకు అంతర్వేది గ్రామ ప్రజలంతా సముద్ర తీరం వెంబడికి తరలి వెళ్లారు. ఈ వెదురు కర్రల మండపం రాష్ట్ర, దేశాల నుంచి అంతర్వేది సముద్ర తీరానికి కొట్టుకు రావడంతో ఆధ్యాత్మిక భావన ప్రజల్లో కలిగి చూసేందుకు ఎగబడ్డారు.



అంతా రామమయం

అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద షిర్డీసాయి విద్యానికేతన్ విద్యార్థులు హనుమాన్ చాలీసా నృత్య రూపకాన్ని ఆకట్టుకునే విధంగా ప్రదర్శించారు. హనుమ వేషధారణలతో చిన్నారులు చక్కటి ప్రదర్శన ఇచ్చారు..



రాజమహేంద్రవరంలో నృత్య రూపకం




హోరాహోరీగా లాన్ టెన్నిస్ పోటీలు

కాకినాడ రూరల్, జనవరి 22: 67వ జాతీయస్థాయి బాలుర లాన్ టెన్నిస్ పోటీలు 3వ రోజు సోమవారం పోటాపోటీగా కొనసాగాయి. 19 ఏళ్లలోపు బాలురకు నిర్వహిస్తున్న ఈ పోటీలు ఈనెల 24 వరకూ కొనసాగనున్నాయని పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. పోటీలు కాకినాడ డీఎస్ఏ, డీమార్ట్ సమీపంలో గల స్మార్ట్‌సిటీ టెన్నిస్‌క్లబ్, ఎస్పీ కార్యాలయం వెనుక గల టెన్నిస్ మైదానంలోనూ జరిగాయి. సోమవారం మొత్తం 24 మ్యాచ్‌లు నిర్వహించగా టీమ్ విభాగంలో హరియాణా, గుజరాత్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హరియాణా జట్టు 2-0 స్కోర్‌తో విజేతగా నిలిచిందన్నారు. అదే విధంగా ద్వితీయ స్థానంలో గుజరాత్, తృతీయ స్థానంలో మహారాష్ట్ర, నాలుగో స్థానంలో ఢిల్లీ నిలిచినట్లు తెలిపారు. సింగిల్స్ మ్యాచ్‌లు మొదటి, రెండు రౌండ్‌లు పూర్తయ్యాయన్నారు. లాన్ టెన్నిస్ జాతీయ పరిశీలకులు రామిరెడ్డి విచ్చేసి మ్యాచ్‌లను తిలకించారు. పోటీలను ఎస్‌జీఎఫ్ రాష్ట్ర చైర్మన్ జి.భానుమూర్తిరాజు, ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి బీవీవీఎస్‌వీ ప్రసాద్, అఫీషియల్స్ కె.శ్రీకుమార్, డీవైఈవోలు డేనియల్‌రాజు, సుభద్ర, డీఎస్‌డీవో బి.శ్రీనివాస్‌కుమార్, ఎంఈవోలు రవి, ఏసుదాసు, శివప్రసాద్, పుల్లయ్య, ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రంగారావు, పీఈటీలు రవిరాజు, బంగార్రాజు, నూకరాజు, శ్రీనివాస్, పట్టాభి, మాసరరావు, వెంకటేష్, త్రిపుల, భానుమతి, శ్రీనివాస్, సువర్చల, మేరీ విజయ, తులసి, సత్యగౌరి,శ్రీలక్ష్మి, శ్రీహరిరాజు పర్యవేక్షించారు.

భారీగా సిగరెట్ ప్యాకెట్లు స్వాధీనం

రాజమహేంద్రవరం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అధికారులు అనుమతుల్లేని బ్రాండ్ల సిగరెట్లను పెద్ద సంఖ్యలో స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ ఎ.సురేశ్‌బాబు వివరాలను వెల్లడించారు. అనుమతులు లేని సిగరెట్ల విక్రయాలపై సోమవారం సోదాలు చేశామన్నారు. రాజమహేంద్రవరం స్టేడియం రోడ్‌లోని మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న శ్రీదేవి బిస్కెట్స్ అండ్ జనరల్ స్టోర్స్‌లో రూ.1.75 లక్షల విలువ చేసే పారిస్, గోల్డ్‌ఫైటర్, ఎ-10, హార్బర్, గోల్డ్ స్టాగ్, గోల్డ్ విమల్, గోల్డ్ విమల్ మింట్ తదితర అనుమతుల్లేని బ్రాండ్ల 4,010 సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. దుకాణం యజమాని దాసరి వెంకట కృష్ణారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి టూటౌన్ పోలీసులకు అప్పగించినట్టు ఎస్పీ వివరించారు. అనుమతుల్లేని సిగరెట్ల అమ్మకం, గుట్కాలను విక్రయించడం, రెస్టారెంట్లు, ఫుడ్ సెంటర్లపై నిరంతర నిఘా పెట్టామని.. నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ నాగ వెంకటరాజు, తహశీల్దార్ విజయ్‌కుమార్, ఎస్ఐ జగన్నాథరెడ్డి, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

చంద్రవరంలో మహిళ దారుణహత్య



చాగల్లు, జనవరి 22: మండలంలోని చంద్రవరం గ్రామంలో ఓ మహిళ సోమవారం దారుణ హత్యకు గురైంది. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సింహాద్రి పూర్ణచంద్రరావు 15 ఏళ్ల క్రితం మృతి చెందాడు. అతని భార్య సుజాత(48) తన ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తోంది. ఐదేళ్ల క్రితం కుమారుడి వివాహం సందర్భంగా ఇంటికి పెయింటు వేయడానికి వచ్చిన అదే గ్రామానికి చెందిన చైతన్యకుమార్ కుటుంబ సభ్యులతో మంచి సంబంధాలు ఏర్పర్చుకున్నాడు. సోమవారం ఇంటి డాబాపై సుజాత బట్టలు ఆరవేస్తున్న సమయంలో కత్తితో మెడపై బలంగా దాడి చేశాడు. అనంతంరం డాబా పైనుంచి హడావిడిగా పారిపోతుండడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు డాబాపై రక్తపు మడుగులో ఉన్న సుజాతను చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వైపీ రమణ సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలు తండ్రి మద్దిపాటి నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. వివాహేతర సంబంధం కారణంగా సుజాతను హత్య చేసినట్టు అనుమానం వ్యక్తం చేస్తూ ఆ కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.

రాష్ట్రభవిష్యత్ కాపాడేది చంద్రబాబునాయుడే

ఆత్రేయపురం, జనవరి 22: రాష్ట్ర భవిష్యత్తును కాపాడేది మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడేనని మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. సోమవారం వాడపల్లిలో 'బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. తొలుత బండారు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు ముళ్లపూడి భాస్కరరావు, కురుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, కార్యకర్తలు పాల్గొన్నారు.

- అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ట నేపథ్యంలో గ్రామాల్లో మార్మోగిన రామ నామం
- రామాలయాలు పూలతో అలంకరణ

హరే రామ.. రామ రామ హరే





మలికిపురంలో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు, ద్రాక్షారామలో సాక్షివారివీధిలో రామాలయం వద్ద శ్రీరామ దీపాలంకరణ, మామిడికుదురులో జైశ్రీరామ్ దీపాలంకరణ

అమలాపురం, జనవరి22 (ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం మహిళలతో పాటు వివిధ సామాజికవర్గాల మహిళలు పెద్ద సంఖ్యలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. గడియారస్తంభం సెంటర్లో ఏర్పాటుచేసిన వేదికపై ఆర్‌ఎస్‌ఎస్,భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ సంఘాల ప్రతినిధులు బులుసు జగదీష్, డాక్టర్‌గోదశి గంగరాజు, ఆకొండి పవన్, యల్లమిల్లి నాగసుధాకొం డలరావు, ఈవని విశ్వేశ్వరశర్మ, రవికుమార్, నల్లా రాంబాబు, వేదనభట్ల సాయిలక్ష్మి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించారు. వందలాది మంది మహిళలు, భక్తులు ఈదరపల్లిలోని ఆర్‌ఎస్‌ఎస్ జనహిత కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రసాద వితరణ కార్యక్రమానికి ఊరేగింపుగా బయలుదేరి వెళ్లారు. అక్కడ కోలాటంతో పాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శ నలు నిర్వహించారు. కరసేవకురాలు వేదనభట్ల సాయిలక్ష్మితో పాటు15మందిని సత్కరించారు. తొలుత రామజన్మభూమి కోసం బలిదానం చేసిన అమరులకు నివాళులర్పించారు. సాయంత్రం అందరి ఇళ్ల వద్ద, గడియార స్తంభం సెంటర్లోను, ఆలయాల వద్ద విశేష దీపాలంకరణలుచేశారు. ఆయాకార్యక్రమాల్లో నల్లా రాంబాబు, కల్వకొలను తాతాజీ, బోనం సత్యవరప్రసాద్, యాళ్ల దొరబాబు, శెట్టిబత్తుల రాజబాబు, లింగోలు పండు పాల్గొన్నారు.

అయినవిల్లి: వాడవాడలా శ్రీరామాలయాలను సుందరంగా అలంకరించారు. జైశ్రీరామ్ అంటూ సీతారాములను పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయాల్లో విష్ణు సహస్ర నామ పారాయణం, శ్రీరామరక్ష స్తోత్రాలను పఠించారు. ఆలయాల వద్ద అన్న సమారాధనలు నిర్వహించారు. క్రాపకోదండ రామాలయంలో పూజలు నిర్వహించి సీతారాముల కల్యాణం జరిపించారు. ముక్తేశ్వరం క్షణ ముక్తేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి అయినవిల్లిలో శ్రీసిద్ధివినాయక ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, దేవస్థానం చైర్మన్ గుత్తుల నాగబాబు ఆధ్వ ర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో భక్తులు పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ కుడుపూడి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కుడుపూడి చంద్రశేఖర్, కొపనాతి శ్రీరామచంద్ర మూర్తి, ఆకుమర్తి బేబీరాణి, పసలపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ద్రాక్షారామ: ఊరువాడారామనామాన్ని జపించారు. మండలంలో చాలా గ్రామాల్లో రామాలయాల్లో భజనలు నిర్వహించారు. ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారిదేవస్థానం ఆధ్వర్యంలో అయోధ్య బాలరాముడు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఆలయంలో ప్రత్యేక ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై భక్తులు వీక్షించే విధంగా ఏర్పాటు చేశారు. తొలుత భీమేశ్వరాలయంవద్ద నుంచి సీతారామలక్ష్మణ సహిత హనుంతుడి ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేక రథంపై ఉత్సవ విగ్రహాలు ఉంచి మేళతాళాలతో ద్రాక్షారామ పురవీధుల్లో శోభాయాత్ర జరిపారు. ఈవో పి.టి.వి.సత్యనారాయణ, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు. భీమక్రోసుపాలెం సీతారామస్వామివారి ఆలయం, హసన్‌బాద రామాలయంలో ప్రత్యేక పూజలు, ఊరేగింపు, భజనలు నిర్వహించారు. ద్రాక్షారామలో నున్నవారి వీధిలో నున్న అశోక్, కోళ్లరవికుమార్, శ్రీనివాస్, కర్రా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిపారు.

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిఆలయంలో కోదండరాముడు కొలువైఉన్నాడు. ఇక్కడి ఆలయ సింహద్వారంపై ఆయోధ్యబాల రాముని ప్రతి రూపాన్ని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మేళతాళ మంగళవాయిద్యాలతో వందలాది మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ఇంటింటా జై శ్రీరామ్ జెండాలను ఎగురవేసి ముత్యాల ముగ్గులు, దీపాలంకరణ జరిపారు. రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల వద్ద అన్నసమారాధన చేపట్టారు. ర్యాలి జగన్మోహినీకేశవస్వామి ఆలయంలో అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవాన్ని ప్రసారంచేశారు. భక్తులతో పారాయణం నిర్వహించారు. ర్యాలి గ్రామానికి చెందిన హారిక సత్యసింధు శ్రీరాముని రంగవల్లిని అద్భుతంగా చిత్రీకరించింది.

ముమ్మిడివరం: మండలంలో సోమవారం శ్రీరామాలయాల్లో, హనుమాన్ ఆలయాల్లోను సీతారాముల శాంతి కల్యాణం, అఖండ హారతి, ప్రసాద వితరణ, విశేష శోభాయాత్ర వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ముమ్మిడివరం అభయాంజనేయస్వామి, టీటీఆర్‌నగర్ సీతారాముల ఆలయంలో, మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల శాంతి కల్యాణం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సుదర్శనం చిరంజీవాచార్యుల ఆధ్వర్యంలోపూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, అభయాంజనేయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి ముమ్మిడివరం పురవీధుల్లో శోభాయాత్ర సాగింది.తాడి నరసింహారావు, చెల్లి అశోక్, పొద్దోకు నారాయణరావు, మాదాల బుజ్జి, మాదాల పరంకుశం, చిక్కాల అంజిబాబు, యాళ్ల ఉద య్, గొల్లపల్లి గోపి, రంకిరెడ్డి రాంబాబు, కాజులూరి రామలిం గేశ్వరరావు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: తిల్లకుప్పలో సిద్ధివినాయకఆలయంలోప్రత్యేక పూజలు నిర్వహించి అక్షింతలను శిరస్సున ధరించారు. పాత ఇంజరంలో సీతారాములకు అష్టోత్తరపూజ, నగర సంకీర్తన నిర్వహించారు. కేశనకుర్రు, కొమరగిరి, పశువుల్లంక, జి.వేమవరంలలో అయోధ్యలో బాలరాముని ప్రతిష్ట వరకు రామనామ సంకీర్తనం చేశారు. సమరసత ఫౌండేషన్ ముమ్మిడివరం సబ్ డివిజన్ ధర్మప్రచారక్ బొంతు కనకారావు, కమిటీ మండల సభ్యులు పితాని శ్రీనివాసరావు, కాళ్లకురన వెంకటేశ్వరరావు, తోటకూర బాబులురాజు, చింతావివేకసత్యనారాయణ, పెమ్మిరెడ్డి రామకోటేశ్వరరావు, ఏలూరి రాంబాబు, పేరాబత్తుల రామకృష్ణారావు, కొండేపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్తపేట: స్థానిక పాతరామాలయంలో శోభాయాత్ర నిర్వహించారు. అవిడి, వాడపాలెం, మందపల్లి, కొత్తపేట, పలివెలతో పాటు పలు గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ఆధ్వర్యంలో కాషాయజెం డాలు, శ్రీరాముని చిత్రపటాలతో ఊరేగింపులు జరిపారు. సాయంత్రం ఇళ్లముందు దీపాలు వెలిగించి రామభక్తినిచా టారు. ప్రియదర్శిని బాలవిహార్‌లో అయోధ్యలో జరిగిన బాలరాముని ప్రతిష్ఠమహోత్సవాన్ని స్ర్కీన్లపై విద్యార్థులకు చూపించారు.

రావులపాలెం: స్థానిక ముసలిరామాలయం ప్రాంగణం నుంచి శ్రీరామస్మరణతో భక్తులు మోటారుసైకిళ్లపై ర్యాలీ నిర్వహించారు. మండలంలోని రామాలయాలు,ముఖ్య కూడళ్ల వద్ద రామనామస్మరణ చేశారు. అన్నసమారాధనలు, నృత్యాలు, కోలాట ప్రదర్శనలతో పండగ వాతావరణం నెలకొంది.

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి, వాడపర్రు, ఎస్.యానాం, భీమనపల్లి, సన్నవిల్లి, చల్లపల్లి, ఉప్పలగుప్తం, విలసవిల్లి గ్రామాల్లోని రామాలయాలకు భక్తులు పోటెత్తారు. 108 కలశల పూజలు, గో పూజలు, అన్నసమారాధనలతో పండగ శోభ నెలకొంది.

కె.గంగవరం: మండలంలోని గ్రామాల్లో రామభక్తులు రామ నామ జపాలతో మార్మోగాయి. గ్రామాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. యండగండిలో తెల్లవారుజామునే నగర సంకీర్తనలు చేశారు. వాడవాడలా శ్రీరాముని జెండాలు కట్టి కాషాయమయం చేశారు. పామర్రు, ఆముజూరు గ్రామాల్లో రామ నామజపం చేస్తూ ర్యాలీలు చేశారు. సత్యవాడలో సలాది ప్రకాష్, సలాది వెర్రిబాబుల ఆధ్వర్యంలో భజనలు చేశారు. కోటిపల్లిలో బీజేపీ నాయకుడు కర్రి చిట్టిబాబు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లోని రామాలయాల వద్ద విగ్రహప్రతిష్ఠ సమయానికి శ్రీరామనామంతోభజనలు చేశారు.

పి.గన్నవరం: ముంగండలో స్వామి ఊరేగింపుతో పాటు బాబ్రి మసీదు కూల్చివేత సమయంలో (1992లో) అయోధ్యలో కరసేవలు అందించిన చెరుకూరి గోపాలకృష్ణ, ముక్కామల శ్రీనివాస్, ఆరుమిల్లి వీరభద్రరావు, గోడవర్తి ఉమామహేశ్వరశాస్త్రీ, నడిమింటి భ్రమరాంబ, కూడిపూడి సూర్యనారాయణలను సన్మానించారు. పి.గన్నవరంలో శ్రీపట్టాభిరామస్వామి ఆలయం నుంచి నగరసంకీర్తనతో పాటు బైక్‌ర్యాలీ నిర్వహించారు. పితానివారిపాలెం శ్రీకోదండరామాలయం వద్ద శ్రీవేదమాత గాయత్రీ దివ్య భవ్య సాధన మందిరం శ్రీరామనంద స్వామి వారి శిష్య బృందం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు లక్ష్మణరావు, హరిష్‌బాబు, సారధీ, బుల్లియ్య, రామకృష్ణ నేతృత్వంలో మూడు హోమ గుండాలతో శ్రీరామ గాయత్రి హోమం నిర్వహించిన అనంతరం భారీ అన్నసమారాధన జరిపించారు. మండలంలోని పలుగ్రామాల్లో రామాలయాలు వద్ద పూజలు నిర్వహించారు. ద్విచక్ర వాహనానికి శ్రీరాముడు జెండాలు ఏర్పాటు చేసుకుని కషాయి వస్త్రాలు ధరించి ప్రచారంనిర్వహించిన విశ్రాంత ఉద్యోగి తెలగారెడ్డి రాము ఆకర్షణగా నిలిచారు.

అంబాజీపేట: మండలంలోని శ్రీరాముని ఆలయాల్లో ప్రత్యేకపూజలు, శోభాయాత్రలు, అన్నసమారాధనలు ఘనంగా నిర్వహించారు. మాచవరం, గంగలకుర్రు అగ్రహారం, ఇరుసుమండ, గంగలకుర్రు, నందంపూడి, మొసలపల్లి, ముక్కామల, చిరతపూడి వాకలగరువు, తొండవరం, ఇసుకపూడి, కె.పెదపూడి, వక్కలంక తదితర గ్రామాల్లో శ్రీరాముని ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. చిన్నారుల నుంచి పెద్దలు, మహిళలు ఉత్సాహంతో శ్రీరాముని గీతాలకు డాన్సులు చేశారు. బాణసంచాకాల్చి సంబరాలు చేసుకున్నారు.పలుచోట్ల ఎల్‌ఈడీ స్ర్కీన్‌లు ఏర్పాటుచేసి అయోధ్య బాలరాముడి ప్రతిష్ఠను లైవ్‌లో భక్తులు వీక్షించారు. ఇరుసుమండలో రథయాత్రనిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దొంగ నాగేశ్వరరావు, అక్కిశెట్టి నాగమణి, అక్కిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, అక్కిశెట్టి రమేష్, కూనపరెడ్డి వెంకట్రావు, సుంకర గణపతిరావు, ఆకుల వెంకటేశ్వరరావు, వీరంశెట్టి వీర్రాజు పాల్గొన్నారు.

మండపేట: మండపేట కరచీ సెంటరులో వున్న శ్రీసీతారామాంజనేయస్వామివారి ఆలయ ట్రస్టీ సభ్యులు రాములవారి శోభాయాత్రను సోమవారం నిర్వహించారు. బూరుగుంట రామాలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ధర్మగుండం చెరువు వద్ద రామాలయం వద్ద ఎల్‌ఈడీ స్కిన్ ఏర్పాటుచేసి అయోధ్య రాముడి ప్రతిష్ఠ కార్యక్రమం వీక్షించేలా ఏర్పాటు చేశారు. గొల్లపుంతకు చెందినయువకులు జైశ్రీరామ్ అంటూ ఇంటిగోడలపై రాశారు. ద్వారపూడి ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించి ఉత్తేజాన్నినింపారు. మండలంలో వున్న 12గ్రామాల్లో రామాలయాలు, ఇతర దేవాలయాల్లో రాములవారికి ప్రత్యేక పూజలు చేశారు. ద్వారపూడి ఆయ్యప్పస్వామి ఆలయ ట్రస్టీ గురుస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అర్తమూరులో వికాస తరంగణి అధ్యక్షుడు కర్రి పాపారాయుడు సారధ్యంలో శోభా యాత్ర నిర్వహించారు. బూరుగుంట రామాలయంలో జరిగిన పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వైసీపీ నేత రెడ్డి రాధాకృష్ణ పాల్గొన్నారు. మండపేటలో శ్రీరామ అక్షరాలతో పాలకోవాలు తయారు చేశారు. ఇది సోషల్‌మీడియాలో వైరల్ అయింది.

మామిడికుదురు: మండలంలోని అన్ని గ్రామాల్లో వాడవాడలా భక్తులు శ్రీరామ నామాన్ని జపించారు. మామిడికుదురులోని కోదండ రామాలయం వద్ద పెద్ద తెర ఏర్పాటు చేయడంతో ఆ మహత్తర విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ఘట్టాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. పలు గ్రామాల్లోని రామాలయాలు, హనుమాన్ ఆలయాల వద్ద శ్రీరాముని శాంతి కల్యాణం, అఖండ హారతి, ప్రసాద వితరణ, విశేష శోభాయాత్ర వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మామిడికుదురులోని నూకాలమ్మ ఆలయం వద్దగల శ్రీరామాలయంలో పూజలు చేశారు. ఆయాచోట్ల జరిగిన భారీ అన్నసమారాధనల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం శ్రీరామనామస్మరణలతో బైక్‌ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించారు.అంగర, పడమరఖండ్రిక, కపిలేశ్వరపురం, వల్లూరు తదితర గ్రామాల్లో యువకులు, మహిళలు, భక్తులు శ్రీరామనామస్మరణతో జెండాలు చేతపట్టుకుని జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. అంగరలో ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి శ్రీరాముని జెండాలతో శోభాయాత్ర ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రముఖులు, గ్రామస్థులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజోలు: మండలంలో ఉన్న ఆయా గ్రామాలు సోమవారం రామనామ స్మరణతో మార్మోగాయి. తాటిపాక సెంటర్‌లో ఉన్న సీతారామాలయంలో కంచర్ల గణపతి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీఅన్నమయ్య రామదాసుల శ్రీరామనామస్మరణ సంకీర్తనలను సుదర్శనం నారాయణాచార్యులు, కొరసాల కరుణాకరరావు, కొమ్మోజు నారాయణలు ఆలపించారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమం ఆద్యంతం వీక్షించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా శ్రీను, కటికిరెడ్డి బాబాయి, బోనం నాగేశ్వరరావు, సూదా బాబ్జి, పితాని సూరిబాబు పాల్గొన్నారు. రాజోలు బాలాజీ గోశాలలో దార్ల పెదబాబు ఆధ్వర్యంలో రామకల్యాణం జరిపారు. టీవీ ద్వారా అయోధ్య ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తుల కోసం ఏర్పాటు చేశారు. అనంతరం అన్నసమారాధన చేశారు. ఆయా కార్యక్రమాల్లో విశ్వహిందూ పరిషత్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి రాజా నాగరత్నకుమార్, కాసు శ్రీనివాస్, రేకపల్లి నాగబాబు, వాడ్రేవు పాపయ్యపంతులు, జడ్పీటీసీ మట్టా శైలజ, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీశ్వరి పాల్గొన్నారు.

మలికిపురం: మలికిపురంలో వేలాది మంది రామ భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో పలు రకాల వాహనాలతో ఊరేగారు. సెంటర్‌లో కోలాటం, భజనలు చేశారు. మహిళలు లలితా పారాయణం చేశారు. మలికిపురం సెంటర్ రెండు భారీ స్ర్కీన్లను ఏర్పాటుచేసి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని లైవ్‌లో చూపించారు.తూర్పుపాలెం, లక్కవరం, గాంధీనగర్, రామరాజులంక, చింతలమోరి గ్రామాల్లో ర్యాలీలు జరిగాయి. గ్రామాల్లో అన్నసమారాధనలు చేశారు. భజనా కాలక్షేపాలు నిర్వహించారు. ఆలయాల్లో దీపారాధనలు జరిపారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో ఉన్న ప్రతీ గ్రామం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. ప్రతీ గ్రామంలో రామాలయాలను కాషాయ జెండాలతో అలంకరించి గ్రామంలో ఉన్న ప్రజలంతా రోడ్లపైకి వచ్చి శ్రీరామ నామ జపం పఠించారు. అంతర్వేది, అంతర్వేది దేవస్థానం, గొంది. రామేశ్వరం, సఖినేటిపల్లి, వీవీమెరక, మోరి, మోరిపోడు, కేశవదాసుపాలెం, అంతర్వేది కర గ్రామాల్లో జైశ్రీరామ్ అంటూ కాషాయ జెండాలతో గ్రామాలన్నీ ఆధ్యాత్మికతతో పులకించాయి. ప్రతీ గ్రామంలోను అన్నసమారాధనలు నిర్వహించారు. అంతర్వేది దేవస్థానం 16 స్తంభాల మండపం వద్ద శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన కమిషనర్ వి.సత్యనారాయణ ఆలయ ఆచారాలతో వస్త్రాలు సమర్పించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేయించారు. అధిక సంఖ్యలో భక్తులు సీతారాముల కల్యాణంలో పాల్గొని శ్రీరామని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

యానాం: యానాంలో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది. యానాంలోని అన్ని రామాలయాల్లో కమిటీ ప్రతినిధులు, నిర్వాహకులు విశేష పూజలు నిర్వహించారు. రామనామ జపంతో ఉత్సవ విగ్రహాలను యానాం పురవీధుల్లో ఊరేగించారు. చిన్నారులు శ్రీరామ, సీత, లక్ష్మణ, హనుమ వేషధారణలతో అలరించారు. గణపతినగర్, మెట్టకుర్రు, ఆదిఆంధ్రపేట, ఫిషర్‌మెన్‌పేట, రామన్నకోడు, అంబేద్కనగర్, కామిశెట్టివారి వీధి, దోబీ వీధి, కనకాలపేట, కురసాంపేట, వరంపేట, దరియాలతిప్ప, సావిత్రినగర్, గిరియాంపేట తదితర ప్రాంతాల్లోని రామాలయాల్లో నిర్వాహకులు పూజలతో పాటు ప్రసాద వితరణ, పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. పలు ఆలయాల్లో దీపాలు వెలిగించి విశేష పూజలు నిర్వహించారు.

కాట్రేనికోన: కాట్రేనికోన హ్యపీక్లబ్ ఆధ్వర్యంలో శ్రీరామ నామ పురసంకీర్తన జరిగింది. రాజులవీధి కోదండ రామాలయంలో పండితుల సమక్షంలో శ్రీసూక్తం, పురుష సూక్త పారాయణం జరిగింది. ఆకొండి నాగరవీంద్రజోగయ్యశాస్త్రి, ఆణివిళ్ల పణికాంత్‌శర్మ, ఆణివిళ్ల సాయిబాబా, ఆణి విళ్ల శేషసాయి, తాతపూడి లక్ష్మీనారాయణమూర్తి, ఆకొండి సాయికిరణ్‌శర్మ, కొత్తగుండు భాస్కరరావు, కోట ఉమామహేశ్వరరావు, గ్రంధి నానాజీ, తాతపూడి గోపి, మంగళంపల్లిశర్మ, మంత్రిప్రగడ శ్రీనివాస్, పెద్దింటి వ్యాసమూర్తి, ఎ.కృష్ణభవాని, తాతపూడి పద్మ, ఆణివిళ్ల లక్ష్మీకౌండిన్య, ఆకొండి లీల, గ్రంధి వెంకటలక్ష్మి, గ్రంధి దేవి, చెరుకు రామకృష్ణ, చెరుకు రామలింగయ్య పాల్గొన్నారు.

అలమూరు: మండలంలోని గ్రామాలు ర్యాలీలు, రామ భజనలతో మార్మోగాయి. రామాలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి ముగ్గులు వేసి దీపాలు వెలిగించారు.

అల్లవరం: అల్లవరం నుంచి అమలాపురం వరకూ శ్రీరాముని జెండాలతో మోటారు సైకిళ్లపై భారీ ర్యాలీ నిర్వహించారు. అల్లవరం, గోడిలంక, కొమరగిరిపట్నం, దేవగుప్తం, డి.రావులపాలెం, బెండమూర్లంక, బోడసకుర్రు గ్రామాల్లోని రామాలయాలు రామనామస్మరణ, భజనలతో మిన్నంటాయి. అయోధ్యనుంచి తీసుకువచ్చిన అక్షింతలను భక్తులకు పంపిణీ చేశారు. పలు ఆలయాల వద్ద అన్నసమారాధన జరిపారు.

రామచంద్రపురం: మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జి.వి.రావు ఆధ్వర్యంలో మోడరన్ జి.ఆర్.సి జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టణంలో శ్రీరామ సంకీర్తన ర్యాలీ నిర్వహించారు. శ్రీరాముడు మానవ రూపంలో జన్మిం చిన దేవుడని,భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శప్రాయమని జి.వి.రావు అన్నారు. కార్యక్రమంలో జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్.రాజేష్, అకడమిక్ అడ్వయిజర్ సీహెచ్.శ్రీనివాస్,కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన రామాలయం, రాజగోపాల్ సెంటర్‌లో గల భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి భక్తులు బైక్‌లకు జెండాలు కట్టుకుని నగర సంకీర్తన చేశారు. పట్టణంలో పలుచోట్ల అన్నదానాలు చేశారు. పట్టణమంతా రామనామంతో మార్మోగిపోయింది. పట్టణంలోప్రతి దుకాణంపై జెండాలు రెపరెపలాడాయి. స్థానిక శివాలయం ఎదట స్టేజి నిర్మించి రాత్రి రాములవారి కల్యాణాన్ని నిర్వహించారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

ముమ్మిడివరం, జనవరి 22: ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు బకాయి పడ్డ ఎనిమిది ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ముమ్మిడివరం జడ్పీబాలికల పాఠ శాలలో సీహెచ్ తిరుపతిరావు అధ్యక్షతన ఎస్టీయూ సంఘ సమావేశం జరిగింది.సమావేశానికి తొలుత జిల్లా అధ్యక్షుడు ఎన్.సత్యనారాయణ, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పి.దొరబాబులు సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ కర్నూలులో వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. సీపీఐ జిల్లా నాయకుడు సత్తిబాబు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు వీవీ లెనిన్ శతదినోత్సవ కార్యక్రమాన్ని వేదికపై నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షురాలిగా పి.హిమబిందు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కరుణలతో పాటు మరికొంత మంది సభ్యులతో పాటు నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. సమావేశంలో కొన్ని తీర్మాణాలు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా తీర్మానించారు.

శ్రీనివాసరావు విడుదలకు సీఎం సహకరించాలి

ముమ్మిడివరం, జనవరి 22: కోడికత్తి కేసులో నిందితుడైన జనిపల్లి శ్రీనివాసరావు విడుదలకు సీఎం జగన్ సహకరించాలని డిమాండుచేస్తూ శ్రీనివాసరావు స్వగ్రామం ఠాణేలంకలో దళితులు నిరసన తెలిపారు. ఠాణేలంకలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శ్రీనివాసరావు తండ్రి తాతారావుతో పాటు పలువురు దళితులు నిరసన చేపట్టారు. శ్రీనివాసరావు రిమాండు ఖైదీగా ఉండడం వల్ల వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు, సోదరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా సీఎం జగన్ కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పి శ్రీనివాసరావు విడుదలకు సహకరించాలని వారు కోరారు.

సీఎం సారు వస్తారని...హడావిడి చేశారు.

పి.గన్నవరం, జనవరి 22: ఈనెల24న జరగనున్న పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కుమారుడి వివాహ వేడుకకు సీఎం జగన్మోహనరెడ్డి హాజరవుతారని జిల్లా యంత్రాగమంతా వాడ్రేవుపల్లి కల్యాణ మండపం వద్ద మూడు రోజులుగా ఏర్పాట్లలో బిజీగా గడిపారు. తీరా సీఎం పర్యటన కాస్త రద్దు కావడంతో ఎక్కడి వారు అక్కడికి నిష్క్రమించారు. అయితే అంగన్‌వాడీల సెగ తగిలే అవకాశం ఉందని తెలిసి సీఎం పర్యటన రద్దు చేసుకున్నారా లేక మరి ఇతర షెడ్యూల్ నేపథ్యంలో రద్దు చేసుకున్నారా అన్న ప్రశ్నలు స్థానిక నాయకుల్లో తలెత్తుతున్నాయి. సీఎం సారు వస్తారని హెలిపాడ్ నిమిత్తం కల్యాణ మండపం వెనుక సూచించిన ప్రదేశానికి చుట్టు పక్కల ఉన్న వరి చేలల్లో నాట్లు కోసం నిల్వ చేసుకున్న సాగునీటిని రెవెన్యూ సిబ్బంది మూడు రోజులుగా బయటకు మళ్లిస్తున్నారు. జగన్ పర్యటన రద్దు కావడంతో సాగునీటిని మళ్లీ లోపలికి పెట్టాల్సి వుంది. ఇప్పటికే నాట్లు లేటు కాగా... ఈజాప్యంతో మరింత ఆలస్యం కానుంది. వీఐపీల కాన్వాయ్‌ల రాకపోకల కోసం ఏడేళ్లుగా అభివృద్ధికి నోచుకోని వాడ్రేవుపల్లి-మానేపల్లి రహదారిలో గుంతలను కొంతమేర యుద్ధప్రాతిపదికన పూడ్చేస్తున్నారు. ఎమ్మెల్యేతో పాటు స్థానిక నాయకులను కలిసి కనీసం గుంతలైనా పూడ్చాలని మొరపెట్టుకున్నా ఫలితం లేదని, సీఎంవస్తారని తెలిసి గుంతలు పూడుస్తున్నారని ఇదంతా చూసిన స్థానికులు బహిరంగ విమర్శ చేస్తున్నారు.

సహజవనరులు దోపిడీ చేస్తున్నారు

ఆలమూరు, జనవరి23: సహజవనరులను అడ్డుఅదుపు లేకుండా దోపిడీ చేస్తున్నారని జనసేన కొత్తపేట నియోజకవర్గ ఇన్చార్జి బండారు శ్రీనివాస్ ధ్వజమెత్తారు. జొన్నాడఇసుక ర్యాంపులో ఇసుక అడ్డగోలుతవ్వకాలపై సోమవారం ఆయన ఆధ్వర్యంలో ధర్నాచేశారు. బాటచార్జీలకు వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న వాహనాల యజమానులకు ఆయనతో పాటునాయకులు సంగిత సుభాష్, సూరపురెడ్డి సత్య కొత్తపల్లి నగేష్ మద్దతు తెలిపారు.

లంక భూముల్లో మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

ఆలమూరు, జనవరి 22: జొన్నాడ, మూలస్థానం అగ్రహారంల్లో మట్టి అక్రమ తవ్వకాలపై జొన్నాడ వైసీపీ సర్పంచ్ కట్టా శ్రీనివాస్‌తో పాటు ఆ పార్టీకి చెందిన చెందిన మరో నేత గంటా మనోహరదాసులు సోమవారం స్పందనలో తహసీల్దారు ఐపీ శెట్టికి ఫిర్యాదు చేశారు. అక్రమ తవ్వకాలను తక్షణం నిలుపుదల చేసి లంక భూములను రక్షించాలని వారు కోరారు.

అయోధ్య నుంచి తెచ్చిన ఇటుకకు పూజలు



మండపేట, జనవరి 22: 1992 డిసెంబరు 6న అయోధ్యలో బాబ్రిమసీదును కూల్చివేశారు. ఎల్.కె.అద్వాని చేపట్టిన రథయాత్రలో పాల్గొన్నట్టు మండపేటకు చెందిన ఆర్‌ఎస్‌ఎస్ కరసేవక్ కడియాల ప్రసాద్ చెప్పారు. మసీదు కింద ఉన్న రామాలయం గర్భ నుంచి ఇటుకను తెచ్చినట్టు ప్రసాద్ తెలిపారు. సోమవారం ధర్మగుండం రామాలయం వద్ద స్వామివారి పాదాల చెత్త ఆ ఇటుకను ఉంచి ప్రత్యేక పూజలు చేసినట్టు తెలిపారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి

మామిడికుదురు, జనవరి22: విద్యుదాఘాతంతో గోగన్నమఠంగ్రామ లైన్‌మెన్ నవుండ్రు రాంబాబు(48) సోమవారంమృతిచెందారు. స్థానికంగా విద్యుత్ మరమ్మతు పనులు నిర్వహిస్తుండగా విద్యుదాఘాతానికి గురై పక్కనే ఉన్న పంటకాల్వలో పడి మృతిచెందినట్టు స్థానికులు పేర్కొన్నారు. మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాంబాబుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

మండపేట, జనవరి22: కపిలేశ్వరపరం మండలం నేలటూరుకు చెందిన వైసీపీ శ్రేణులు సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలోఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. గాజుల శ్రీనివాసు, నగేష్, చేమకూరి సత్తిబాబు, రుద్రాక్షుల రామరావు, గెడ్డాడ వీరవెంకట సత్యనారాయణ, వీరా బసవ మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు, రవీంద్ర, శివకుమార్, చల్లా సతీష్‌పాలింకి అచ్చియ్య పట్టాభిలకు వేగుళ్ల కండువాలుకప్పి ఆహ్వానించారు.

పి.గన్నవరం ఎమ్మెల్యే సీటు మాదిగలకు ఇవ్వాలి

అమలాపురం రూరల్, జనవరి 22: పి.గన్నవరం ఎమ్మెల్యే సీటును మాదిగలకు కేటాయించాలని మాదిగల జేఏసీ జిల్లా నాయకులు డిమాండు చేశారు. డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నడిపూడిలోని జగ్జీవన్‌రామ్ భవన్‌లో జిల్లా నాయకుల సమావేశం నిర్వహించారు. ఇప్పటికే పి.గన్నవరం స్థానానికై టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశామని, ఈనెల29 తర్వాత టీడీపీ జిల్లా నాయకులు, మాదిగ పెద్దలతో సమావేశం నిర్వహిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని నాగేశ్వరరావు కోరారు. అనంతరం మాదిగల పొలిటికల్ జేఏసీ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అమలాపురంలో ఆర్టీసీ మోడల్ స్టేషన్ కాంప్లెక్సు

అమలాపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో రూ.5కోట్లతో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఆర్టీసీ మోడల్ స్టేషన్ కాంప్లెక్సు నిర్మాణానికి నిధులు కేటాయించినట్టు మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ కాంప్లెక్సును తొలగించి దాని స్థానంలో మోడరన్ బస్‌స్టేషన్ నిర్మిస్తామన్నారు. ఈమోడల్ స్టేషన్‌లో 24 ప్లాట్‌ఫారాలతో పాటు నాలుగు అంతస్తులతో బస్‌స్టేషన్ కాంప్లెక్సు నిర్మించనున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటికే పాలనా పరమైన ఆమోదం వచ్చిందన్నారు. త్వరలోనే కాంప్లెక్సు నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారంలో శంకు స్థాపన చేయనున్నట్టు మంత్రి తెలిపారు.

రూ.30లక్షలతో మిగులు అంచనా బడ్జెట్

ముమ్మిడివరం, జనవరి 22: ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా వార్షిక అంచనా బడ్జెట్‌ను ముమ్మిడివరం నగరపంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. నగర పంచా యతీ సమావేశ మందిరంలో సోమవారం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్య క్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. నగర పంచాయతీలో ప్రజల సంక్షేమం, అభివృద్ధికి సమాన భాగ స్వామ్యం కల్పిస్తూ అంచనాలతో వార్షిక బడ్జెట్‌ను రూపొందించామన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.4,99,88,349 ప్రారంభ నిల్వకాగా దానిని సవరించిన బడ్జెట్ ముగింపు నిల్వ రూ.2,53,77,813 చూపారు. 2024- 25బడ్జెట్ సంవత్సరానికి ప్రారంభనిల్వ కాగా రాబడి ఆదాయం రూ.4,86,15, 899గాచూపి రాబడిఖర్చు రూ.4,44,27,504గా నిర్ధారించారు. మిగులు రాబడి ఆదాయం రూ.41,88,395 మూల ధన నిధులకు మళ్లించి బడ్జెట్ అంచనాలను తయారు చేశారు. మూలధన ఆదాయం కింద రూ.17కోట్ల 40లక్షలు వస్తుందని అంచనా వేసి మూలధన ఖర్చుల నిమిత్తం రూ.20,05,65,840 అవుతుందని, అంచనాల్లో పొందుపరిచి 2024-25 ముగింపు నిల్వ రూ.30,00,68గా చూపారు. ఈబడ్జెట్ అంచనాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

అంగన్‌వాడీల అక్రమ అరెస్టులు దారుణం

అంబాజీపేట స్టేషన్ వద్ద అంగన్‌వాడీలు నిరసన

అంబాజీపేట, జనవరి 22: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అంగన్‌వాడీలు చలో విజయవాడ పిలుపునిస్తే ప్రభుత్వం, పోలీసులు అడ్డుకోవడం దారుణమని అంగన్‌వాడీ వర్కర్లు మండిపడ్డారు. వివిధ వాహనాలలో వెళ్తున్న అంగన్‌వాడీ వర్కర్లను పలు చోట్ల తనిఖీలు నిర్వహించి వాహనాలతో పాటు అంగన్‌వాడీలను అడ్డుకుని అదుపులోకి తీసుకుని ఆయా స్టేషన్లకు తరలించారు. అంబాజీపేటలో స్టేషన్‌కు 30మంది అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకుని స్థానిక పెద్దవీధిలోని కల్యాణమండపంలో పోలీసులు సిబ్బంది పర్యవేక్షణలో ఉంచారు. స్టేషన్ వద్ద మరికొంత మందిని ఉంచడంతో మిగిలిన అంగన్‌వాడీలు స్టేషన్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. అరెస్టు చేసిన అంగన్‌వాడీలను తక్షణం వదలిపెట్టాలని నినాదాలు చేశారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి అంగన్‌వాడీ నాయకురాళ్లు గుత్తుల షైమావతి, కె.అరుణకుమారి, సీహెచ్ వీరవేణి, మంగాలక్ష్మీ, సుబ్బలక్ష్మి ఆధ్వ ర్యంలో విజయవాడలో తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలకు వెళుతున్న 30మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను సోమవారం ఉదయం ట్రైనీ డీఎస్పీ విష్ణుస్వరూప్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. టీడీపీ రాష్ట్ర అంగన్‌వాడీ డ్వాక్రాఆర్గనైజింగ్ కార్యదర్శి మెండి కమల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పోలీసుస్టేషన్‌కు వెళ్లి అంగన్‌వాడీల అరెస్టులను ఖండించారు. వారికి సంఘీభావం తెలిపారు. మోకా పార్వతి, మీనా కుమారి, బొక్కా రుక్మిణి, వాసంశెట్టి అమ్మాజీ, కొండేటి వెంకటలక్ష్మీ, పెదపూడి రుక్మిణి, ముమ్మిడివరపు వరలక్ష్మి ఉన్నారు. అరెస్టుచేసిన అంగన్‌వాడీలను మధ్యాహ్నంవ్యక్తిగత పూచీకత్తులపై విడుదల చేశారు.

రాయవరం: డిమాండ్ల సాధన కోసం చలో విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీలను అరెస్టు చేయడం సిగ్గుచేటని అంగన్వాడీ కార్యకర్తల వర్కింగ్ ప్రెసిడెంట్ డి.ఆదిలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ తరలివెళ్తున్న అంగన్వాడీ కార్యకర్తలను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. టీడీపీ, యూటీఎఫ్ నాయకులు అంగన్వాడీల అరెస్టులను ఖండించి, వారికి సంఘీభావం తెలిపారు.

కాట్రేనికోన: కాట్రేనికోన పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అంగన్‌వాడీల దీక్షా శిబిరంపై పోలీసులు దాడి చేసినందుకు నిరసనగా ఆందోళన జరిగింది. విత్తనాల రాంబాబు, ఎం.విజయకుమారి, పి.పార్వతి, బి.రమాదేవి, ఆర్. మంగాయమ్మ, భారతి, ఆర్. చైతన్య, లక్ష్మి, గౌరి పాల్గొన్నారు.

మండపేట: మండపేట అర్బన్, రూరల్ పోలీసులు అంగన్‌వాడీలను విజయవాడకు వెళ్లకుండా ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్లకు తరలించారు. మండపేటలో 11మంది, మండలంలో 17మంది అంగన్‌వాడీలను అదుపులోకి తీసుకుని, పోలీసులు కేసులు నమోదు చేశారు.

కొత్తపేట: విజయవాడ బయల్దేరుతున్న బస్సులోంచి అంగన్‌వాడీ సంఘ నేతలు ఏడుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను పోలీసులు నిర్బంధించడం దారుణమన్నారు.

బీజేపీ దాడులకు కాంగ్రెస్ నిరసన

అమలాపురం టౌన్, జనవరి 22: రాహుల్‌గాంధీ నేతృత్వంలో జరుగుతున్న భారత్ జూడో న్యాయయాత్రపై అస్సాంలో బీజేపీ గూండాలు భౌతిక దాడులకు దిగడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ జిల్లాశాఖ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మోదీ నియంతృత్వ చర్యలను నిరసిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. గడియారస్తంభం సెంటర్‌లోని గాంధీ విగ్రహం వద్ద జరిగిన నిరసనలో ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, పీసీసీ ఉపాధ్యక్షులు కొత్తూరి శ్రీనివాసరావు, ముషిణి రామకృష్ణారావు పాల్గొన్నారు.

పల్టీ కొట్టిన చిన్నకారు

అల్లవరం, జనవరి 22: రాజోలు నుంచి అమలాపురం వస్తూ బొంతు నితిన్ సోమవారం రాత్రి అతివేగంగా కారు నడిపి బోడసకుర్రు బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న ఒక ఆటోను, మరో కారును ఢీ కొట్టాడు. దీనితో అత డి కారు పక్కన ఉన్న గోతిలోకి పల్టీ కొట్టింది. వాహనాల్లో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.